క్లుప్తంగా

ఉపాధి ఎఫ్‌ఏపై ఫిర్యాదు

దొరవారిసత్రం: మినమనముడి గ్రామ పరిధిలో ఉపాధి పథకం ఎఫ్‌ఏ మణెయ్యపై స్పందన కార్యక్రమంలో స్థానికులు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఉపాధి కూలీల కూలి చెల్లింపు విషయంలో కొందరికి చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడంతో పాటు కూలీలకు పనులు కల్పించడం లేదని ఫిర్యాదు పేర్కొన్నారు. అదేవిధంగా కంపెనీలకు వెళ్లే కార్మికులకు కూడా ఉపాధి పనులకు వస్తున్నట్లు మస్టర్ వేసి నగదు కాజేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిమిత్తం ఎంపీడీఓ సింగయ్యకు ఆదేశాలు అందడంతో పూర్తి వివరాలు ఇవ్వాల్సిందిగా ఏపీఓ విజయ్‌భాస్కర్‌ను ఆయన ఆదేశించారు.

చెంగాళమ్మ సేవలో దక్షిణ రైల్వే జీఎం


జీఎంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్‌ఎన్ సింగ్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన ఆలయానికి విచ్చేయగానే ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి సాదరంగా స్వాగతం పలికి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేయించారు.

23న ఎంట్రన్స్ పరీక్షలు

నాయుడుపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ చేరే విద్యార్థులకు ఈనెల 23న గురుకులంలో ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ మల్లికార్జున శనివారం తెలిపారు. వివరాల కోసం 97045 50098ను సంప్రదించవచ్చన్నారు.

బ్రహ్మోత్సవాలకు తరలిరండి


పోస్టర్లు విడుదల చేస్తున్న సభ్యులు, ఈఓ

చిల్లకూరు: మే 1 నుంచి నిర్వహించనున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలి రావాలని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ కందలి ఆనందరావు కోరారు. కలవకొండ గ్రామంలో వెలసియున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను ఆలయ ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు దొంతు వెంకటేశ్వర్లు, మారుబోయిన రామచంద్ర, ఉడతా సుబ్రహ్మణ్యం, బూదురు కోటమ్మ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

దక్కిలి: వెంబులూరు పంచాయతీలోని వెలుగొండలు కింద వెలసియున్న ఆదిలక్ష్మీ సమేత యోగ నరసింహస్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఉదయం 6.30 గంటలకు స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు విజయ్‌కుమార్,సుబ్బారావు ఏర్పాట్లు చేశారు.

సద్వినియోగం చేసుకోండి

రాపూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ భాస్కర్‌చక్రవర్తి పేర్కొన్నారు. రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఎం జీవన్‌జ్యోతి పథకం కింద 18నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వారు సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందని, అలాగే సురక్షా బీమా కింద రూ.20 చెల్లిస్తే ప్రమాదబీమా కింద రూ.2 లక్షలు వస్తుందన్నారు. కెనరా బ్యాంకు మేనేజర్ సుధీర్, ఏపీఎం క్రిష్ణయ్య పాల్గొన్నారు.

ఒకే ఈతలో మూడు దూడలు


మూడు దూడలకు జన్మనిచ్చిన ఆవు

చిట్టమూరు: మండలంలోని చిన్నదరఖాస్తు గ్రామానికి చెందిన సురేష్ అనే పాడి రైతుకు చెందిన ఓ ఆవు మూడు దూడలకు జన్మనివ్వడంతో ప్రజలు ఆశ్చర్యంగా వచ్చి చూసి వెళుతున్నారు. అయితే వాటిలో ఒకటి మృతిచెందగా మిగిలిన రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు.

గుర్తుతెలియని యువకుడు మృతి

గూడూరు రూరల్: చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై ఉన్న పంబలేరు బ్రిడ్జి సమీపంలో 35 ఏళ్ల యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని శనివారం గూడూరు రూరల్ పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఎడమ చేతిపై లక్ష్మి అనే పచ్చబొట్టు ఉంది.

భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఈద్గా మైదానాల్లో సామూహిక ప్రార్థనలు
- రాజకీయ ప్రతినిధుల రంజాన్ శుభాకాంక్షలు


గూడూరులో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

పరమ పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గా మైదానాల్లో ముస్లింలు రంజాన్ ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజకీయ ప్రతినిధులు, ప్రముఖులు సామూహిక నమాజ్ ప్రాంతాలకు చేరుకుని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.


నాయుడుపేట: జామీయ మసీద్ షాదీ మంజిల్ ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నాయుడుపేటటౌన్: ముస్లింలు రంజాన్ పండుగను శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక జామీయ మసీదు సమీపంలో షాదిమంజీల్ ఈద్గా మైదానం వద్ద జామియా మసీదు మౌలానా అబ్బుబక్కర్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక పార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం నిరుపేదలకు నగదు దానం చేశారు. పట్టణంలోని దర్గా వద్ద అమీర్‌షావాలి మసీదు మౌలానా అష్రాఫ్‌ఆలీ అధ్వర్యంలో, పాత బస్టాండు సమీపంలో నూర్ మసీదు వద్ద అక్కడి హాఫీజ్ హుసేన్ సాహెబ్ ఈదుత్ ఫీతర్ నమాజులను నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, 786 సేవా సంఘ వ్యవస్థాపకులు రఫీ వారి సంస్థ తరపున పలువురు ముతవల్లీలు, మౌలాన అబ్బుబక్కర్తో పాటు మత పెద్దలను సత్కరించారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: జామియా, అక్బరియా, షార్ ఉద్యోగ కేఆర్‌పీ కాలనీల సమీపంలోని గఫూరియా మసీదుల నుంచి ముస్లింలు సామూహికంగా మన్నారుపోలూరులోని ఈద్గా వద్దకు వెళ్లి ఈద్–ఫితర్ నమాజును ఆచరించారు. మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి పార్ధనల్లో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సైదాపురంలో..

సైదాపురం: సైదాపురం ,తురిమెర్ల, ఊటుకూరు,కలిచేడు,గిద్దలూరు, మర్లపూడి గ్రామాల్లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రాపూరులో..

రాపూరు: స్థానిక పెద్ద పీర్ల చావడి నుంచి ఈద్గావద్దకు ముస్లింలు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాపూరు,పెనుబర్తి, ఓబులాయిపల్లి రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: పెళ్లకూరు, రావులపాడు, చెంబేడు, తాళ్వాయిపాడు, నెలబల్లి గ్రామాల్లోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చెంబేడు, మసీదుల వద్ద పేదలకు అన్నదానం చేశారు.

వెంకటగిరి: స్థానిక జ్యోతిమహల్ సెంటర్ వద్ద ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు ఖురాన్ విశిష్టతను వివరించారు. జామియా మసీదు, చాకలివీధి మసీదు, కుమ్మర గుంట మసీదు, బంగారుపేట మసీదుల్లో ప్రార్థనలు చేశారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: వేణుంబాకం, దొరవారిసత్రం, గొల్లపాళెం, కల్లూరు గ్రామాల్లోని ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు రంజాన్ విశిష్టతను వివరించారు.

తడలో..

తడ: పూడికుప్పం ఈద్గా మైదానంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. పేదలకు దానాలు చేశారు.

ఓజిలిలో..

ఓజిలి: రాచపాళెం, ఆర్మేనిపాడు, కురుగొండ, నెమళ్లపూడి, ఓజిలి గ్రామాల్లోని మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.పేదలకు పండ్లు, దుస్తులు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

గూడూరులో..

గూడూరు: పట్టణంలోని పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొని, నియోజకవర్గ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ సహకారంతో గూడూరులో మరో మసీదు ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: మండలంలోని ఈద్గా ప్రాంతాలలో ప్రత్యేక ప్రార్థనలు (నమాజు) చేశారు. అనంతరం పేదలకు వస్త్రాలు, నగదు దానంగా అందించారు. కొంత మంది భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: మండలంలో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోటలో..

కోట: ముస్లింలు జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శ్యాంసుందరపురం వద్ద ఉన్న ఈద్గా వద్దకు విచ్చేసి రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



సూళ్లూరుపేట ఈద్గాలో మాట్లాడుతున్న దబ్బల శ్రీమంత్‌రెడ్డి, పార్థనల్లో ముస్లింలు


రాపూరులో..


పూడికుప్పంలో..


పారిచెర్లవారిపాళెంలో..


కోటలో..


వెంకటగిరిలో..


వేణుంబాకంలో..


ఊటుకూరులో...

పథకాలు కొనసాగాలంటే జగనన్నే రావాలి


సింగనాలత్తూరులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం పూలతోట గ్రామ సచివాలయం పరిధిలోని సింగనాలత్తూరు, మేలనాలత్తూరు, చవటకండ్రిగ, ఆనేగొట్టం, కరటాముడి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకోసమే దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. దీంతో రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని కోరారు. సూళ్లూరుపేట చెంగాళమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, నేతలు బాబునాయుడు, రాధాకృష్ణనాయుడు, సుబ్రమణ్యం, రాజగోపాల్, మునస్వామినాయుడు, సురేష్‌రెడ్డి, బాబురెడ్డి, బాబు పాల్గొన్నారు.

గూడూరు ఉపాధి ఏపీఓ హఠాన్మరణం


వెంకటరమణయ్య (ఫైల్)

గూడూరురూరల్: సైదాపురం మండలం చాగణం గ్రామానికి చెందిన గూడూరు మండల ఉపాధి ఏపీఓ కుమ్మరిగుంట వెంకటరమణయ్య(50) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. శుక్రవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో విధులకు హాజరైన ఏపీఓ మధ్యాహ్నం అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు.


నివాళులర్పిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏపీఓకు నివాళి

సైదాపురం: చాగణం గ్రామంలో గూడూరు ఏపీఓ వెంకటరమణయ్య భౌతికకాయానికి శనివారం తిరుపతి జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఏపీడీ రవికుమార్, ఎంపీడీ వెంకటేశ్వరరావు ఉన్నారు.

వీక్షకుల గ్యాలరీలో సందడే సందడి


పీఎస్‌ఎల్‌వీ సీ55 ప్రయోగాన్ని చూసేందుకు వచ్చిన వీక్షకులు

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లో మొదటి ప్రయోగవేదిక నుంచి శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు ప్రయోగించిన పీఎస్‌ఎల్‌వీ సీ55 ప్రయోగాన్ని వీక్షించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి పది వేలమంది దాకా విచ్చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్‌లు, బస్సులు బారులు తీరి కనిపించాయి. అయితే షార్ కేంద్రం వారు రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలోనే ఒక ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. శనివారం కావడం, రంజాన్ పండుగ సెలవు దినం కావడంతో స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీగా విచ్చేశారు. ప్రయోగాన్ని వీక్షించాలనుకునే వారంతా పులికాట్ సరస్సులో రోడ్డంతా కిక్కిరిసినట్టుగా కనిపించారు. అయితే రాకెట్ నింగికేగుతున్న సమయంలో వారంతా కొట్టిన చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది.

ఇస్రో శాస్త్రవేత్తలకు ఎంపీ, ఎమ్మెల్యే అభినందనలు..

శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి శనివారం ప్రయోగించిన పీఎస్‌ఎల్‌వీ సీ55 ప్రయోగం విజయ వంతం కావడంతో ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. వాణిజ్యపరమైన ప్రయోగాలు చేయడంలో ఇస్రో దిట్ట అని మరోమారు నిరూపించుకున్నారని అన్నారు. ప్రపంచమే గర్వించదగిన రాకెట్ కేంద్రం తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉండడం దేశానికి గర్వకారణమన్నారు.

శ్రీవారిసేవలో నెల్లూరు జేసీ


ఆశీర్వచనాలు అందుకుంటున్న కూర్మనంద్ దంపతులు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిలలక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని శనివారం నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనంద్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఈఓ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటకృష్ణయ్యనాయుడు

బాలాయపల్లి (వెంకటగిరి): యాచవరం పీఏసీఎస్ (ప్రైమరీ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ సొసైటీ) చైర్మన్‌గా రావెళ్ల వెంకటకృష్ణయ్యనాయుడు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి సహకారంతో తాను పీఏసీఎస్ చైర్మన్ అయ్యానని చెబుతూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డులు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ సమీపంలో తెలుగుగంగ 7వ బ్రాంచ్ కాలువకు చెందిన లైనింగ్ పనులను రాత్రికి రాత్రే చదును చేసి ఆక్రమించుకున్న భూమిలో సంబంధిత తెలుగు గంగ అధికారులు రెండు రోజుల కింద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గత వారం సాక్షిలో 'రాత్రికి రాత్రే చదును' అనే వార్త ప్రచురితం కావడంతో తెలుగుగంగ ఈఈ రాధాకృష్ణామూర్తి స్పందించి సంబంధిత ఏఈ విక్రమ్‌కు ఆదేశాలు ఇవ్వడంతో రెండు రోజుల కిందట ఆక్రమణకు గురైన కాలువకు చెందిన భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇది ఇలాఉండగా దీని పక్కనే జాతీయ రహదారికి చెందిన భూమి, రెవెన్యూ శాఖకు చెందిన మరి కొంత భూమిని ఆక్రమణదారులు ఆక్రమించి చదును చేశారు. వీటి పరిస్థితి ఎంటీ అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వీడిన క్షుద్రపూజల మిస్టరీ

నాయుడుపేటటౌన్: నాయుడుపేట పట్టణంలో జరిగిన క్షుద్రపూజల కలకలం వ్యవహారాన్ని సీఐ నర్సింహరావు సారథ్యంలో పోలీసులు ఛేదించారు. పట్టణంలో గిండివారితోట వీధిలో నూతనంగా భవన నిర్మాణం చేస్తున్న గోపి మీద కోపంతో అతని సమీప బంధువైన పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామానికి చెందిన జ్ఞానేంద్ర పట్టణానికి చెందిన కొంతమంది యువకులతో కలిసి గోపి నిర్మాణం చేస్తున్న ఇంటి వద్ద క్షుద్రపూజలను చేసినట్లు పోలీసులు నిగ్గుతెల్చారు. వీరు యూట్యూబ్‌లో చూసి క్షుద్రపూజలను జ్ఞానేంద్రతో పాటు యువకులు కలిసి చేసినట్లు పోలీసులు ఎదుట అంగీకరించారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన


పెరియవట్టులో నేతలు,


నాయుడుపేటలో..


ఓజిలిలో..

ఓజిలి: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేషస్పందన లభిస్తోంది. శనివారం కురుగొండలో వైఎస్సార్‌సీపీ నేత గెడి వేణురెడ్డి ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

తడలో..

తడ: రామాపురం, పెరియవట్టు, కారూరు గ్రామాల్లో శనివారం గృహసారథులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ ఆర్కే సుందర్‌రెడ్డి, నేతలు మునుస్వామిరెడ్డి, ఏజే మురుగన్‌రెడ్డి, రామలింగం, చిన్నప్పన్, రవిరెడ్డి పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: స్థానిక 16 వార్డు పరిధిలో గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఆ వార్డు ఇన్‌చార్జి బీఎంఆర్ నగర్ సచివాలయ కన్వీనర్ తిరుమలరావు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



గూడూరు: చెన్నూరు దళితవాడలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి దాతృత్వంతో రూ.60 లక్షలు వెచ్చించి, చెన్నకేశవ స్వామి ఆలయాన్ని ఇటీవలే నూతనంగా నిర్మించారు. శనివారం స్వామివారికి ఆయన చేతుల మీదుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని రంగురంగుల పండ్లు, పూలు, కూరగాయలతో విశేషాలంకరించారు.

క్రీడాకారుల దాతృత్వం అభినందనీయం

- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు


వృద్ధురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

గూడూరు: స్టేడియంలో వాకింగ్ చేసే యువకులు, క్రీడాకారుల దాతృత్వం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కొనియాడారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో శనివారం దేవదానమ్మ అనే వృద్ధురాలికి, యువకులు, క్రీడాకారుల దాతృత్వంతో ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్టేడియానికి వచ్చే సమయంలో దేవదానమ్మ ప్రతిరోజూ కన్పిస్తుండేదన్నారు. ఆమెకు పక్షవాతం రావడంతో, స్టేడియానికి వచ్చే క్రీడాకారులు, వాకింగ్‌కు వచ్చే యువకులు కలిసి, ఆమెకు ఆర్థికసాయాన్ని అందజేయాలనుకున్నారన్నారు. తాను కూడా కొంత మొత్తాన్ని వారితో కలిసి అందజేశానన్నారు. కోటేశ్వరరావు, మస్తానయ్య, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

వైర్లను తొలగించండి..

పట్టణంలోని గాంధీబొమ్మ కూడలి ప్రాంతం వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి అడ్డదిడ్డంగా కేబుల్ వైర్లు చుట్టి ఉండడంతో ఆ ప్రాంతంలోని వ్యాపారులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత శాఖాధికారులను పిలిపించి, వెంటనే కేబుల్ వైర్లను తొలగించాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ పట్టణాధ్యక్షుడు బొమిడి శ్రీనివాసులు పాల్గొన్నారు.